ప్రజాశక్తి

సోమవారం 25 సెప్టెంబర్ 2023 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా

అటకెక్కిన ఆనకట్టలు



ప్రకాశం బ్యారేజీ వద్ద దిగువకు వదిలిన వరద నీరు (పాత చిత్రం)


- కృష్ణానదిపై మూడు నిర్మించాలని నిర్ణయం
- డిపిఆర్‌లపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోని ప్రభుత్వం
- మిగుల జలాలు సముద్రం పాలు...
- సాగునీటి ఎద్దడితో రైతుల ఇబ్బందులు

ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి

కృష్ణానదిపై నిర్మించాలని తలపెట్టిన ప్రాజెక్టుల నిర్మాణాలు కార్యరూపం దాల్చక పోవడంతో వేలాది టిఎంసిల వరద నీరు వృథాగా సముద్రం పాలవుతోంది. గత మూడేళ్లుగా దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో మిగుల జలాలను వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. ఒక పక్క ఉపయోగపడాల్సిన వరద నీరు సముద్రం పాలు కావడం, మరోవైపు సాగు నీటి ఎద్దడితో రైతన్నల పరస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి వదులుతున్న కష్ణా మిగులు జలాల మొత్తం మూడేళ్లుగా బాగా పెరిగింది. ఈ ఏడాదిలో సుమారు 10 లక్షల క్యూసెక్కుల వరకు దిగువకు (మిగతా 6లో)

సముద్రంలో కలిసిన మిగులు జలాల వివరాలు

సంవత్సరం	టిఎంసిలు
2022-23	496.6
2021-22	501.4
2020-21	1,278.1
2019-20	797.1
2018-19	39.0
2017-18	--
2016-17	55.2
2015-16	9.3
2014-15	69.8
2013-14	400.9
2012-13	57.5



పైసా వసూల్..!

- డిపిఒ కార్యాలయంలో అనధికార వసూళ్లు
- మేజర్, మైనర్ పంచాయతీలకు సెప'రేటు'
- ఆందోళనలో పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

కృష్ణాజిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో అనధికార వసూళ్లపర్వం పెచ్చుమీరిందనే ఆరోపణలు వినవస్తున్నాయి. కార్యాలయ అభివృద్ధి పనుల పేరుతో అనధికార వసూళ్లకు పాల్పడుతుండటంతో పంచాయతీ కార్యాదర్శులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణాజిల్లా పంచాయతీ కార్యాలయంలో ఇటీవల హాలు నిర్మాణం, నిర్వహణ కార్యాలయంలో ఏసీలు, కుర్చీలు, ఫ్యాన్‌లు తదితరాలు ఏర్పాటు చేశారు. ఈ బిల్లులను ప్రభుత్వం నుంచి రాబట్టాల్సి ఉంది. అయితే ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదనే సాకులు చూపి గ్రామ పంచాయతీల నుంచి ముక్కుపిండి వసూలు చేసినట్లు తెలుస్తోంది. మేజర్ పంచాయతీల నుంచి కనీసం రూ.50 వేలు, మైనర్ పంచాయతీ నుంచి రూ.20 వేలు ఫిక్స్ చేసి వసూలు చేసినట్లు సమాచారం. ఇటీవల కార్యదర్శుల బదిలీలు జరిగిన పంచాయతీల్లో బాధ్యతలు చేపట్టిన నూతన కార్యదర్శులను రెండో విడత అదనంగా చెల్లించాలని కోరారు. ఈ వసూళ్లపై కార్యదర్శులు పంచాయతీ పాలకవర్గాలకు చెప్పడంతో సర్పంచ్‌లు ఆగ్రహించారు. నూతనంగా జిల్లా అధికారులు బాధ్యతలు తీసుకునే క్రమంలోనూ అవసరాలుంటాయనే పేరుతో కార్యాలయంలో తిష్ట వేసిన వసూళ్ల రాజాలు పంచాయతీ కార్యాదర్శులకు ఫోన్ చేసి భారీగా వసూళ్లకు (మిగతా 6లో)

అంగన్‌వాడీలపై నిర్బంధం

- 'చలో విజయవాడ' భగ్నానికి పోలీసుల యత్నం
- ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు
- పలువురికి నోటీసులు జారీ



పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, విజయవాడ

అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన చలో విజయవాడను భగ్నం చేసేందుకు ఆదివారం ఉదయం నుంచే కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో ముందస్తు అరెస్టులకు పూనుకుంది. చలో విజయవాడకు అనుమతి లేదని, 144 సెక్షన్ అమల్లో ఉందని అంగన్‌వాడీలకు నోటీసులిచ్చింది. చలో విజయవాడకు వెళ్లిన అంగన్‌వాడీలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. గూడూరు, మచిలీపట్నం, గుడివాడ, కోడూరు మండలం ఉల్లిపాలెం, పెడన మండలంతో పాటు ఎన్‌టిఆర్ జిల్లాలోని నందిగామ, ఇబ్రహీంపట్నం, వీరులపాడు, మైలవరం తదితర మండలాల్లో అంగన్‌వాడీ, సిఐటియు నాయకుల ఇళ్ల వద్ద పోలీసులను కాపలా ఉంచారు. ముందస్తు అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్లలో ఉంచారు. ఇళ్ల నుండి బయటకు వెళ్లే అవకాశం లేకుండా కార్యకర్తలను, హెల్పర్‌లను ఇంట్లో నుంచి బయటకు రానీయకుండా (మిగతా 6లో)

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయవాడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు చేస్తూ పార్టీ బలం పెంచుకుంటూ ముందుకు సాగాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో సిపిఎం సెంట్రల్ సిటీ విస్తృతస్థాయి సమావేశం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు కె.దుర్గారావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, ప్రజా హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. మతోన్మాద ఎజెండాతో ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసి తమ సొంత ఎజెండాను ముందుకు తీసుకొస్తుందన్నారు. అధిక ధరలు, విద్యుత్ ఛార్జీలతో పాటు ఇతర భారాలను ప్రజలపై వేసి దోచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక, ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రల సమస్యల వలయంగా మారిందన్నారు. రాష్ట్రంలో బిజెపికి మద్దతు ఇచ్చే పార్టీలను ఎండగట్టడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. నవంబర్ 7న విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఎం (మిగతా 6లో)

ఆర్థిక పరిపుష్టే లక్ష్యంగా గ్రామీణాభివృద్ధి

డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు





ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లా గ్రామీణాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ పింఛన్ కానుక, బ్యాంక్‌లింకేజి, వైఎస్ఆర్ ఆసరా, సున్నా వడ్డీ, ఉన్నతి, స్త్రీ నిధి, వైఎస్ఆర్ చేయూత, ఆసరా తదితర సంక్షేమ పథకాలను ఎన్‌టిఆర్ జిల్లాలో విస్తృతంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ ద్వారా అమలు జరుగుతున్న వివిధ పథకాలపై ఆయన 'ప్రజాశక్తి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: వైఎస్ఆర్ పింఛన్‌కానుక అమలు తీరు ఎలా ఉంది?

గ్రామాల్లో అర్హులైన ప్రతి పింఛన్‌దారుడికి పింఛన్ కానుక పథకం వర్తింప చేస్తూ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా తయారైంది. జిల్లా వ్యాప్తంగా 2,27,293 మంది ఫించన్‌దారులకు ప్రతి నెలా సుమారు రూ.63.09 కోట్ల మేర పంపిణీ చేయడం జరుగుతుంది.

ప్రశ్న: బ్యాంక్ లింకేజీ స్కీమ్ ద్వారా ఎంత మందికి రుణ సదుపాయం కల్పిస్తున్నారు?

కుటుంబ జీవనోపాధి మెరుగుపరిచేందుకు ఎంసిపిల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లడం జరుగుతుంది. జిల్లాలో 25,749 స్వయం సహాయ సంఘాలున్నాయి. ఇందులో దాదాపు 2.65 లక్షల మంది మహిళా సభ్యులున్నారు. వీరికి 2023-24 సంవత్సరానికి ఇప్పటి వరకు రూ.14,924 స్వయం సహాయక సంఘాలకు (మిగతా 6లో)

అంగన్‌వాడీల ముందస్తు అరెస్టులు

ప్రజాశక్తి - మైలవరం : అంగన్వాడి, మధ్యాహ్నం భోజన పథకం యూనియన్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి ఆదివారం మైలవరం పోలీస్ స్టేషన్కు తరలించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25వ తేదీన విజయవాడలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. అరెస్టయిన వారిలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఆర్.ఆర్.వి.పుష్పకుమారి, పద్మ, ఝాన్సీ, మధ్యాహ్నం భోజనం పథకం సంఘం నాయకులున్నారు. ముందస్తు అరెస్టు చేయటం దుర్మార్గమని సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్ ఒక ప్రకటనలో ఖండించారు.పోలీసుల అదుపులో ఉన్న మైలవరానికి చెందిన మధ్యాహ్నం భోజన సంగం నాయకురాలు శేషమ్మ బీపీ పెరగడంతో అస్వస్థకు గురై స్టేషన్లోని కుర్చీలో కుప్పకూలింది. హుటాహుటిన సిబ్బంది శేషమ్మను స్థానికంగా ఉన్న వైద్యుల దగ్గర తీసుకెళ్లి వైద్యం అందిస్తున్నారు. అంగన్వాడి, మధ్యాహ్నం భోజన సంగం నాయకులు ను ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో శేషమ్మ పోలీస్ స్టేషన్లోనే అస్వస్థకు గురైంది. జిల్లాలోని పెనుగంచిప్రోలుకు చెందిన సిఐటియు నాయకులు దాసరి నాగేశ్వరరావు, నందిగామకు చెందిన కె గోపాల్, మైలవరంనకు చెందిన కె సుధాకర్‌లను పోలీసులు అరెస్ట్ చేసి, స్టేషన్లకు తరలించారు. **వీరులపాడు :** మండలంలోని మధ్యాహ్న భోజనం, అంగన్వాడి సిబ్బందిని వీరులపాడు పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొన్నారు. మహిళలు అని చూడకుండా గంటల తరబడి స్టేషన్లోని నిర్బంధించారు. చెన్నారావు పాలెం గ్రామానికి చెందిన మధ్యాహ్న భోజన కార్మికురాలు తన భర్తకు విద్యుత్ ప్రమాదంలో గాయాలైనవి అన్నప్పటికీ విజయవాడ ధర్నాకు వెళ్ళకూడదని బలవంతంగా పోలీస్‌స్టేషన్ తరలించారు. భర్త పరిస్థితి బాగాలేదని విన్నవించుకున్న పోలీసులు ఏమాత్రం దయ చూపలేదు. **ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం మండలంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులను ముందస్తు అక్రమ అరెస్టులను సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కమిటీ తీవ్రంగా ఖండించారు. **నందిగామ :** అంగన్వాడి వర్కర్స్ చలో విజయవాడ కార్యక్రమాన్ని పురస్కరించుకొని నందిగామ పోలీసులు ఆదివారం పలువురు అంగన్వాడీ కార్యకర్తలు మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను సిఐటియు నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి నందిగామ పోలీస్ స్టేషన్ తరలించారు. సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కట్టార్పు గోపాల్ సిఐటి నాయకులు కర్రీ వెంకటేశ్వరరావు అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు సరళ మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మిక నాయకురాలు సుశీల, విజయలక్ష్మి తదితరులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి నందిగామ పోలీస్ స్టేషన్ తరలించారు. ముందస్తు అక్రమ అరెస్టులను సిఐటియు నాయకులు ఖండించారు. **తిరువూరు :** అంగనవాడీ, మధ్యాహ్న భోజన పథకం నాయకులు, కార్యకర్తలను పోలీసులు అక్రమ అరెస్టు చేయటం దుర్మార్గమని సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్ర ప్రసాద్, సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఆకుల రవి, పంతంగి శ్రీనివాసరావు అన్నారు. అనుమతి లేదని పోలీసులు ప్రకటన చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేన్నారు. **గంపలగూడెం:** మండలంలో స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. గంపలగూడెంలో ఎస్ఐపి రాంబాబు ఐసిడిఎస్, మిడ్ డే మీల్స్ వర్కర్లను ముందస్తుగా అరెస్టు చేశారు. స్థానిక ప్రజా సంఘాల నాయకులు గువ్వల సీతారామిరెడ్డి, జానపాటి వెంకటేశ్వరరావు, మద్దిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు వర్కర్లకు సంఘీభావం తెలిపారు.



ఇబ్రహీంపట్నంలో...



వీరులపాడులో...



గంపలగూడెంలో...



తిరువూరులో...



విస్సన్నపేటలో...



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు....

26న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - కంచికచర్ల : విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఎస్ ఎఫ్ ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ పిలుపునిచ్చారు. ఈ నెల 26న విజయవాడలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఫెడరేషన్ కంచికచర్ల మండల కమిటీ ఆద్వర్యంలో ఆదివారం స్థానిక ఎంఈఓ కార్యక్రమం ఎదుట పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపి నాయక్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల గురించి చర్చ జరపాలని కోరారు. ప్రభుత్వ మొద్దునిద్ర వీడేందుకు 26న జరిగే చలో కలెక్టరేట్ కు విద్యార్థులు వేల సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల మండల కార్యదర్శి జాహిదా,అధ్యక్షుడు మాధవ్, రాము,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సభ్యత్వ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణ శివారు అనాసాగరం మైత్రి సేవా సమితి కార్యాలయంలో జనసేన పార్టీ క్రియా శీలక సభ్యత్వం తీసుకున్న సభ్యులకు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ అక్కల గాంధీ రామ్ మోహన్ చేతుల మీదుగా అందజేశారు. అక్కలగాంధీ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కార్యకర్తల శ్రేయస్సు కాంక్షిస్తూ 5 లక్షల ఇన్స్యూరెన్స్ కల్పించారని తెలిపారు. నందిగామ పట్టణ 20వ వార్డు జనసేన కౌన్సిల్ సభ్యులు తాటి వెంకటకష్ణ, వీర మహిళా విభాగం నాయకురాలు మేకపోతుల శ్రీ లక్ష్మి యాదవ్, నియోజవర్గ నాయకులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** జనసేనపార్టీ ఆధ్వర్యంలో చిట్టేలు కోటేష్ – చిట్టేలు హరీష్, తిరుమలశెట్టి సురేష్ అధ్యక్షతన క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ మరియు కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమానికి జనసేనపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్కల రామ్మోహన్ రావు (గాంధీ) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీ, కొండపల్లి మున్సిపాలిటీ నాయకులు చెరుకుమల్లి సురేష్, ఎర్రంశెట్టి నాని, డి. నాగబాబు, సుజాత, గ్రామ జనసైనికులు, మహిళలు పాల్గొన్నారు.

29న 'వాహన మిత్ర'

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక భవానీపురంలో గల ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్పొ రేటర్లు, నాయకులు, పార్టీ కార్యకర్తల ముఖ్య సమావేశం ఆదివారం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఈనెల 29న నియోజకవర్గంలో జరగబోయే వాహన మిత్ర నిధుల విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ చైర్మన్లు డైరెక్టర్లు పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ నాయకులూ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మిథిలానగర్‌లో వినాయకచవితి వేడుకల్లో నిర్వాహకులు

నిమజ్జనాలు... అన్నదానాలు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలోని 9వ వార్డు కష్ణ బాలాజీ నగర్‌లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణ నాథుడీని శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం శ్రీ శివ నాగేంద్ర(పుట్ట) స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ను ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంఎల్‌సి ప్రారంభించి, ప్రజలకు అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎంసి చైర్మన్ మస్తాన్, ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. శ్రీ సీతారామాంజనేయ కూరగాయల మార్కెట్ వర్తక సంఘం వారు ఏర్పాటు చేయబడిన 21వ గణపతి వార్షిక మహోత్సవాల్లో ఆదివారం శ్రీవల్లి సమేత పద్మావతి కోలాటం బందం వారిచే కోలాటం, కూచిపూడి నాట్యం ప్రదర్శనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. కూచిపూడి, కోలాటం కళాకారులకు నిర్వాహకులు తొర్లికొండ సీతారామయ్య తదితరులు సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. **మైలవరం :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మైలవరంలో పలు కూడలలో ఏర్పాటుచేసిన విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. రాజాపేట, హాజీపేట, దేవుని చెరువులో విగ్రహాలను ట్రాక్టర్లపై మైలవరం పురవీధుల్లో ఊరేగించారు. నూజివీడు రోడ్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 4వా వార్డ్ రజక బజార్‌లో ఆదివారం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు . గణేష్ ఉత్సవ కమిటీ యూత్ సభ్యులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని బంగారపు కోట్ల సెంటర్‌లో గల శ్రీ వరసిద్ధి వినాయకుని వద్ద షరాబు వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు పాల్గొన్నారు. మండలంలోని ముక్త్యాల, వేదాద్రి గ్రామాల్లో కష్ణా నదిలో వినాయక నిమజ్జనాలు భారీగా నిర్వహించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వినాయక నిమజ్జనాలు భారీ మొత్తంలో జరిగాయి. జగ్గయ్యపేట పట్టణం, మండలం, వత్సవాయి మండలం తో పాటు తెలంగాణ రాష్ట్రం నుండి నుండి గణనాథులు ఆటోలు, లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్ల పై విచ్చేసి భారీ ఎత్తున నిమజ్జనాలు నిర్వహించారు. నిమజ్జనాలకు ముందు వినాయక కొన్ని మండలాల వద్ద కొన్నిచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నిమజ్జనాల సందర్భంగా కష్ణా నదిలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా గజఈతగాళ్లతో నిమజ్జనం చేయిస్తున్నారు. **భవానీపురం :** స్థానిక 45వ డివిజన్ మిథిలానగర్‌లో వినాయకచవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఆదివారం వేలాదిమందికి అన్నదాన వితరణ జరిగింది. ఈ సందర్భంగా మిథిలానగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పరిమి మల్లేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సహకరిస్తున్న కమిటీ వారికి, కాలనీ సభ్యులకు, స్థానిక ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు.

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - భవానీపురం : 11వ రోజు పశ్చిమ టిడిపి కార్యాలయంలో 44వ డివిజన్ అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్, కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎంఎస్.బేగ్ మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం విధ్వంసం తప్ప రాష్ట్ర అభివద్ధి శూన్యమని విమర్శించారు. చంద్రబాబునాయుడును మరల ముఖ్యమంత్రిని చేసుకొని రాష్ట్రాన్ని అభివద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి సారిపల్లి రాధాకష్ణ ,జిల్లా బీసీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి బూర కనకారావు, జిల్లా ఉపాధ్యక్షుడు సుకాశి కిరణ్, పశ్చిమ నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు నమ్మి భాను ప్రకాష్, పశ్చిమ ఎస్సీసెల్ అధ్యక్షులు ఎర్ర రామారావు , పశ్చిమ మహిళా అధ్యక్షురాలు సుకాశి సరిత, 44వ డివిజన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టులను నిరసిస్తూ నందిగామ రైతుపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చేస్తున్న నిరసన దీక్షా శిబిరాన్ని మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదివారం ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ తెలుగు రైతు, జనసేన నాయకులు కార్యకర్తలు 12వరోజు దీక్ష నిర్వహించారు. టిడిపి నాయకులు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింప చేశారు. **జగ్గయ్యపేట:** పట్టణంలో గత 16 రోజులుగా జరుగుతున్న దీక్ష శిబిరంలో ఆదివారం వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు అధ్యక్షతన జరిగిన దీక్షలో వత్సవాయి మండలం భీమవరం గ్రామం నుండి ఇంజం రామారావు మరియు కొత్తా వైకుంఠరావు ల ఆద్వర్యంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు దీక్షలో కూర్చున్నారు. వీరికి ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాం, టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ సంఘీభావం తెలిపారు. **మైలవరం :** చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ మైలవరం, జి.కొండూరు మండలంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 12వ రోజూ కొనసాగాయి. మైలవరంలో శిబిరంలో చంద్రగూడెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చంద్రబాబుకు మద్దతుగా టిడిపి నిరశనదీక్షల్లో బేగ్, బొడ్డుపల్లి శ్రీనివాసరావు

కళారూపాలతో ప్రజలను మేల్కొల్పాలి

- ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్


మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ప్రజాశక్తి-గన్నవరం : సమస్యలపై ప్రజలను మేల్కొలిపేది ఆట, పాట అని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ తెలిపారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర స్థాయి డప్పు శిక్షణా శిభిరం కష్ణా జిల్లా గన్నవరంలో ఆదివారం ప్రారంభమయ్యింది. ఈ శిభిరం ప్రారంభ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ... పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రైవేటీ కరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయడానికి ప్రజాకళాకారులు పాటుపడాలని పిలుపు నిచ్చారు. మహిళలు, దళితులపై జరుగుతున్న దాడులపై గళమెత్తా లన్నారు. భావప్రకటనా స్వేచ్ఛను హరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందున్నా యని ప్రతిపక్ష నేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బాపట్లలో సైకత శిల్పం వేసిన కళాకారుడిపై కేసులు పెట్టడం అత్యంత హేయమైన చర్య అని ప్రభుత్వ చర్యను దుయ్యబట్టారు. కవులు, కళాకారులపై ఆంక్షలు విధించడం, ప్రశ్నని చంపాలనుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య చీలికలు సష్టించి తన పబ్బం గడుపుకోవాలని చూస్తుందన్నారు. ఈ అంశాలన్నింటిపై ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం ప్రజాకళారూపాలకు పదును పెట్టేందుకే ఈ శిక్షణా శిభిరం నిర్వహిస్తున్నా మన్నారు. డప్పు మోతతో పాలకుల గుండెలదరాలన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రజాకంటక విధానాలపై గ్రామగ్రామాన కళాకారులు దళాలుగా ఏర్పడి ప్రజల్ని పోరాటాలకు సన్నద్ధం చేయాలన్నారు. కళ ప్రజల కోసం అనే లక్ష్యంతో ప్రజానాట్యమండలి కళాకారులు కషి చేయాలన్నారు. ఈ శిభిరానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఖాశిం ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా డప్పు శిక్షకుడిగా ఎం.పరమేష్ శిక్షణ ఇచ్చారు. ఈ మూడు రోజులు జరిగే శిక్షణా శిభిరానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ ఖాశిం ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. శిక్షకులుగా ప్రముఖ డప్పు మాస్టర్ ఎం. పరమేష్ గారు వ్యవహరిస్తున్నారు. కష్ణా, గుంటూరు, రంపచోడవరం, పల్నాడు, నెల్లూరు, ఏలూరు జిల్లాల నుండి కళాకారులు శిక్షణకి హాజరయ్యారు.



విద్యుత్ సంస్కరణలతో ప్రజలపై భారాలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 'విద్యుత్ సంస్కరణలు ప్రజలపై భారాలు' అనే అంశంపై గౌరిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ స్టడీ సర్కిల్‌కి ముఖ్యఅతిథిగా ఎల్ఐసి యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ హాజరై ప్రసంగించారు. విద్యుత్ సంస్కరణలు ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నా యని, సర్దుబాటు చార్జీలు పేరుతో 2014లో కాల్చిన కరెంటుకి ఇప్పుడు బిల్లు కట్టమనడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వం ఆ పద్ధతుల్లో విద్యుత్తు భారాలు మోపుతుందని ఆయన అన్నారు. ఇదే కాదని రానున్న రోజుల్లో స్మార్ట్ మీటర్లు ఫ్రీ ఫైట్ మీటర్లు వచ్చేందుకు రంగం సిద్ధం చేశారని, దీన్ని అందరూ వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మాజీటీ శ్రీనివాసరావు, బొడ్డు నాగరాజు, వంగలరాజు, పొదలి వెంకన్న, వెంట్రపాటీ శ్యాము, జెంట్రి నాయుడు, సుజ్ఞానం జనార్ధనరావు, ధనశ్రీ, పద్మ సుజాత తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధి చిట్టూర్పు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని టిడిపి నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరపనేని ప్రసాద్, యార్లగడ్డ వీరభద్రరావు, గ్రామస్తులు జి.ప్రవీణ్, కే.ఆనంద్ సాగర్, ఆర్.హేమంత్, జి.సుబ్రమణ్యం, ఎస్.అంజి, ఎం.సురేష్ బాబు, ఆర్.భాను, బి.దేవి, ఆర్.గోపి తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : ప్రభుత్వం కల్పి స్తున్న అవకాశాలను, విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని, సకలాంగులతో తాము సమానమేనని భావించి నిత్యం మనోధైర్యం, ఆత్మవిశ్వాసం హదయాం తరాలలో నింపుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపు హాలులో కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆర్టిఫిసియల్ లింబ్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సికింద్రా బాద్ వారి సూచనల మేరకు దివ్యాంగులకు వయో వద్ధులకు అవసరమైన ఉపకరణాలు అందజేయడం కొరకు శిబిరాలలో గుర్తించబడిన వారికి ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ వెంకటరమణ మాట్లాడుతూ భారతదేశంలోనే దాదాపు 104 మిలియన్ల మంది సీనియర్ సిటిజన్లు ఉన్నారని, 2026 నాటికి ఈ సంఖ్య 173 మిలియన్లకు పెరుగుతుందని అంచనా ఉందన్నారు. మన దేశంలోని సీనియర్ సిటిజన్లలో 70 శాతం గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చినవారే అని ఆయన పేర్కొంటూ, ఆ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని భారతప్రభుత్వం ఒక పథకాన్ని రూపొందిం చిందని, ఆ పథకం 1 ఏప్రిల్ 2017న ఉనికిలోకి వచ్చిందని, ఈ పథకానికి "రాష్ట్రీయ వయోశ్రీ యోజన" అని పేరు పెట్టారని తెలిపారు. విభిన్న ప్రతిభా వంతులు అంగవైకల్యమును తుల్యముగా భావించి మనో నిబ్బరంతో అన్ని రంగాల ల్లోనూ రాణిస్తున్నారని, విభిన్న ప్రతిభా వంతుల సంక్షే మానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, చట్టాలు, హక్కులపై వారు అవగాహన పెంచుకోవాలని సూచిం చారు. సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉమేష్ కుమార్ గుప్తా, ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆలింకో) సికింద్రాబాద్ ప్రతినిధులు చంద్రకాంత్ గుప్తా, సునీత, కష్ణాజిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వాడ్రే వు కామరాజు, ఉపకరణాల లబ్ధిదారులు పాల్గొన్నారు.


ఉపకరణాలు అందిస్తున్న దృశ్యం


పాపారావును పరామర్శిస్తున్న వడ్డే శోభనాద్రిశ్వరరావు

శేషగిరిరావుకు ఘన నివాళి


ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం దాలిపర్రు లో ఇటీవల మరణించిన మిక్కిలినేని శేషగిరిరావు పెద్దకర్మ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాద్రేశ్వరరావు పాల్గొని శేషగిరిరావు చిత్ర పటం వద్ద నివాళు లు అర్పించారు. శేషగిరిరావు తండ్రి రైతు నాయకులు, కార్మిక సంఘం నాయకులు మిక్కిలినేని పాపారావుని పరామ ర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మెన్ గొర్రెపాటి వెంకట రామకష్ణ, వేమూరి రమేష్ (పాగోలు), వీరమాచినేని భవానీ ప్రసాద్, మిక్కిలినేని మధు తదితరులు పాల్గొన్నారు


గణనాథుల నిమజ్జనం

ప్రజాశక్తి-గన్నవరం : బీకేఆర్ వద్ధాశ్రమం, అమ్మ చిల్డ్రన్ హెూమ్ ల ఆధ్వర్యంలో ఆశ్రమంలో వినాయక చవితి సందర్భంగా పూజలందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. వేద మంత్రోచ్చారణ లతో గణనాథునికి చిగురుపాటి కుమారస్వామి సుధారాణి దంపతులు, కడియాల హనుమంతు సక్కుబాయి , శివారెడ్డి, రాధిక ,బొకినాల అశోక్ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా గణనాధుని ఆశ్రమం నుండి గన్నవరం పురవీధుల ద్వారా ఊరేగిస్తూ కేసరపల్లి లోని ఏలూరు కాలువ నందు నిమజ్జనం చేశారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో నాదిండ్ల మోహన్, నల్లూరు కోటేశ్వర రావు, పోలవరపు అనిల్, అప్పల ఆనంద్ తో పాటు పెద్ద ఎత్తున గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఛైర్మన్ కానూరి శేషుమాధవి మాట్లాడుతూ ఆశ్రమంలో నిర్వహించిన గణపతి ఉత్సవాలను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : గణేశ్ నవరాత్రులు పురస్కరించుకుని స్థానిక నగరపంచాయతీ కార్యాలయం రోడ్డు వినాయక మండపంలో జరిగిన సామూహిక కుంకుమార్చనలో మాజీ ఎమ్మెల్యే అన్నే విజయలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. గణేశ్ ఉత్సవ కమిటీ నాయకులు పడ మటవెంకటేశ్వరరావు, కుటుంబరావు తదితరులు ఆమెకు సాదరస్వాగతం పలికి స్వా మివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా స్వామి వారికి జరిగిన పూజా కార్యక్రమంలో మహిళలు పెద్దయెత్తున పాల్గొన్నారు.

శ్రీ నవనీత గణపతిగా దర్శనం

స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవ స్థానంలో ఆదివారం గణపతి నవరాత్రి మహెూ త్సవాలలో భాగంగా 7వ రోజు శ్రీ నవనీత గణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్ర మంలో దేవస్థాన ధర్మకర్తల కమిటీ ఛైర్మన్ గంటా చంద్రశేఖర్, దేవస్థాన ఇఓ ప్రసాద్, సహాయకులు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు బంటుమిల్లి సూర్యనారాయణరావు, బొర్రా రవికుమార్, సిద్దాబత్తుల నీలవేణి, భారతి, రాధిక, తాత రజనీకుమారి, వేదపండితులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి** : బంటుమిల్లి మండలంలో సంతమార్కెట్లో వేంచేసి ఉన్న వినాయకుడిని ఉప్పల రాము దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండల కన్వీనర్ సుజ్ఞానం, మహేష్, సచివాలయం కన్వీనర్ కొప్పర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. **ఉంగుటూరు** : ఉంగుటూరు మండల పరిధిలోని ముక్కపాడు గ్రామంలో వినాయక నిమజ్జనం పురస్కరించుకొని అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఉంగుటూరు మండల తెదేపా అధ్యక్షులు ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, బాలకృష్ణ, షణ్ముఖ, శ్రీనివాసరావు, బుల్లాబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


ఉయ్యూరులో...


ఉంగుటూరులో...

దేవాలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లిలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయానికి రూ.50,000 విరాళాన్ని చల్లపల్లి పంచాయతీ ఉప సర్పంచ్ ముమ్మనేని నాని పుట్టినరోజు సందర్భంగా అందజేశారు. ఆదివారం ఆలయంలో ముమ్మనేని నాని.. మల్లేశ్వరి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలు పూలమాలలు, దుశ్శాలువాలతో నానీ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు అంబటి భువనేశ్వరరావు, టీడీపీ నేతలు తాతా ప్రదీప్, వేముల హరికష్ణ, రావులపల్లి పండు, విశ్రాంత వీఆర్వోలు గొర్రెపాటి పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యునికి ఆరోగ్య భరోసా 'ఆయుష్మాన్ భవ'

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ సహాయ మంత్రి భారతీయ ప్రవీణ్ పవార్



సభలో మాట్లాడుతున్న కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ పథకం ద్వారా దేశంలోని ప్రతి సామాన్యునికి వైద్య, ఆరోగ్యానికి సంబంధించి భరోసా కల్పిస్తుందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భవ సేవా పక్షోత్సవాల్లో భాగంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని వన్‌టౌన్ కొత్తపేటలోని కాకరపర్తి భావనారాయణ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి విస్తృతమైన ఆరోగ్య భరోసా కల్పించే పథకం ఆయుష్మాన్‌భవ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలోని ప్రతి ఒక్కరికి వైద్యానికి భరోసా కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. కేబీఎన్ కళాశాల నిర్వహిస్తున్న సేవలు, వారు చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని), నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె. నివాస్, జాయింట్ కలెక్టర్ పి. సంపత్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం సుహాసిని, రెడ్‌క్రాస్ సోసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సమరం, కార్పొరేటర్ బోయి సత్యబాబు, కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, కోశాధికారి అన్నం రామకష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు, బీజేపీ నగర అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



చెరువు పనులు పరిశీలిస్తున్న దృశ్యం

ఊర చెరువు పనుల పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఊర చెరువు అభివద్ధి నిర్మాణ పనులను జగ్గయ్యపేట పట్టణ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణ అభివద్ధిలో ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆలోచనలకు అనుగుణంగా ప్రముఖ పర్యాటక కేంద్రంగా జగ్గయ్యపేట చెరువును అభివద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే చెరువు చుట్టూతా ప్రహరీ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ తదితర నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వర రావు, వైఎస్సార్సీపీ నాయకులు మున్సిపల్ డీ ఈ శివ కోటేశ్వరరావు, ఏ ఈ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పెంచడం ఎంతో అవసరమని 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య అన్నారు. ఆదివారం 45వ డివిజన్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాధురి లావణ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు పెంచడాన్ని బాధ్యతగా తీసుకోవాలని ఆమె అన్నారు. చక్కటి ఆహ్లాదకర వాతావరణాన్ని అందించడంలో మొక్కలు, చెట్ల పాత్ర ఎంతో ఉందని ఆమె అన్నారు.



గిడుగు రుద్రరాజుతో పోతిన వెంకటేశ్వరరావు తదితరులు

గిడుగు రుద్రరాజుకు సత్కారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజును సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోతిన వెంకటేశ్వర రావు శాలువతో సత్కరించారు. విజయవాడ వన్‌టౌన్‌లోని పోతిన వెంకటేశ్వరరావు ఇంటికి మర్యాదపూర్వకంగా రుద్రరాజు విచ్చేసిన సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ నాయకులు పోతిన అచ్యుతరావు ఘనంగా స్వాగతం పలికారు. పోతిన స్వగృహానికి రుద్రరాజుతో వచ్చిన వారిలో రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు తాంతియకుమారి, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు వలిబోయిన గురునాథం, నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, కష్ణ జిల్లా మాజీ అధ్యక్షులు ధనేకుల మురళి, ఏఐసిసి సభ్యులు సతీష్, నాయకులు పోతిన పైడరావు, పోతిన బేసికంటేశ్వరుడు, రాంపిళ్ళ శ్రీనివాసరావు, బెవర శ్రీను, ఎండి గౌస్, నాగూర్, షేక్ ఖుర్షీద, కాంగ్రెస్ నాయకులు , యువజన కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు

ప్రజాశక్తి - నందిగామ : "జగనన్న శాశ్వత భూహక్కు –భూ రక్ష" రైతులకు ఎంతో మేలు జరుగుతుందని నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. మండలంలోని పల్లగిరి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో "జగనన్న భూ హక్కు –భూ రక్ష" కార్యక్రమం ద్వారా మంజూరైన శాశ్వత భూ హక్కు పత్రాలను శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు రైతులకు ఆదివారం పంపిణీ చేశారు .. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూముల రీ సర్వేకు శ్రీకారం చుట్టి కొత్త చరిత్రకు నాంది పలికారని తెలిపారు. దీని ద్వారా భవిష్యత్తులో ఎవరూ రికార్డులను తారుమారు చేయకుండా భూమికి సంబంధించిన డిజిటల్ రికార్డులను తయారు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ తహశీల్దారు నరసింహారావు, పల్లగిరి గ్రామ సర్పంచ్ మానికొండ రవి కిరణ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఖాజాకు సన్మానం

ప్రజాశక్తి - భవానీపురం : ఇటీవల వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ పోస్టుకు జరిగిన ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం భవానీపురానికి చెందిన మాజీ డైరెక్టర్ షేక్ ఖాజా డైరెక్టర్‌గా మరోసారి గెలుపొందారు. ఈ నేపథ్యంలో ఆదివారం భవానీపురంలో గల ఎన్టీఆర్ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, వైకాపా కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తల నడుమ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ ఇటీవల జరిగిన వక్ఫ్ బోర్డ్ ఎన్నికల ముత్తవల్లిల కోటలో షేక్ ఖాజా భారీ విజయం సాధించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ నాయకులూ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎస్ఐ చర్చి ప్రారంభం

ప్రజాశక్తి - చందర్లపాడు: చందర్లపాడు మండలంలోని రామన్నపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన సి.ఎస్.ఐ చర్చి, బిషప్ నూతన గహ ప్రారంభోత్సవం కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పాల్గొని, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా సి.ఎస్.ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్‌ని శాలువాతో సత్కరించిన దైవజనులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చర్చిని ప్రారంభించిన ఎంఎల్‌సి అరుణ్‌కుమార్



మాట్లాడుతున్న రాఘవేంద్ర

కింగ్స్ ది ఇంగ్లీష్ స్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని 'కింగ్స్ ది ఇంగ్లిష్ స్కూల్' అనే ఒక అత్యంత అధునాతనమైన కాన్సెప్ట్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ రంగపురం రాఘవేంద్ర ఆదివారం ప్రారంభించారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్ అమరనాధ్ వడ్డేపల్లి ఈ కొత్త కాన్సెప్ట్‌ను వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తిగా ఇంగ్లిష్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్స్ డిగ్రీ అయినవారికీ, నిరుద్యోగులకు, ఆసక్తి గల మహిళలకు ఒక గొప్పవరం లాంటిది అని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఇంగ్లిష్ యొక్క విలువని చెబుతూ సభలో ప్రసంగించిన కింగ్స్ విద్యార్థిని విద్యార్థులని ప్రోత్సహించారు. కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా విచ్చేసిన తపోవన్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధీర్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఇంగ్లిష్ భాష అవసరాన్ని వివరించారు.

మహిళా బిల్లులో బిసిలకు సబ్ కోట రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : దేశంలో 50 శాతం ఉన్న బీసీలకు ఇటీవల పార్లమెంట్లో ప్రవేశపెట్టిన మహిళ రిజర్వేషన్లు ఎస్సీ ఎస్టీలకు మాదిరిగా బీసీలకు సబ్ కోట రిజర్వేషన్ కల్పించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది ఆరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సీతారాంపురంలో బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆరేపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా రిజర్వేషన్ లేకపోవడం వలన చట్ట సభలలో పార్లమెంట్, అసెంబ్లీలో ఓసి మహిళలు ఎక్కువగా ఎన్నికవుతారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పి గోవిందరావు, దేవరకొండ శ్రీను, తోమాటి కష్ణ, వెంకట్, చాపల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆరేపల్లి వెంకటేశ్వర్లు



నాట్యం చేస్తున్న విద్యార్థులు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : జెఎంఎస్ నాట్యవేద అకాడమి ఆఫ్ మ్యూజిక్ అండ్ ఢ్యాన్స్ సంస్థ 18వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం మొగల్‌రాజపురంలోని సిద్దార్ధ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 127 మంది జెఎంఎస్ నాట్యవేద విద్యార్థులచే ఏర్పాటుచేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఒకేసారి 127 మంది విద్యార్థులచే నిర్వహించిన ఈకార్యక్రమం మన సంస్కృతి సంప్రదాయాలను తెలియచేసే విధంగా ఉందని పలువురు వక్తలు అన్నారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో కామ్రేడ్ జి.ఆర్.కె. పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి నిర్వాహకులు గోళ్ల నారాయణరావు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం జెఎంఎస్ నాట్యవేద నిర్వాహకులు జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి నిర్వహణలో జరిగింది.

దళిత బహుజనులు రాజకీయ శక్తిగా అవతరించాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దళిత బహుజనులు రాజకీయ శక్తిగా అవతరించాలని ప్రముఖ పత్రికా సంపాదకులు సతీష్ చందర్ అన్నారు. బ్లూ వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేటి మనువాద అగ్రకుల పార్టీలు దళిత, బహుజనుల పట్ల చేస్తున్న కుల రాజకీయాలకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. అధికారం ద్వారానే అన్ని సమస్యలకు పరిష్కార మార్గాలు ఏర్పడుతాయని, దళిత, బహుజనులు ఐక్యతగా తెలుగు రాష్ట్రాల్లో అధికారం కోసం అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లూ వింగ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి మల్లికార్జున్, బ్లూవింగ్స్ ఫౌండేషన్ చీఫ్‌అడ్వైజర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన సతీష్ చందర్, తదితరులు

29న మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వీరులపాడు : దళిత రక్షణయాత్రలో భాగంగా వీరులపాడు, జుజ్జూరు గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ ఇంటింటి ప్రచారం జరిగింది. అనంతరం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రజా సంఘాల నాయకులు అహమ్మద్ గౌస్ చాట్ల రవి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు జరపాలి, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు జరపాలి, అసైన్డ్ చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని ఈ నెల 29,న విజయవాడ లో జరుగు మహాధర్నా ను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం వీరులపాడు మండల కార్యదర్శి చాట్ల.రవి, మంగలపూడి.సుందరరావు, గడ్డం ప్రభాకర్, పాల్గొన్నారు

కొరటాల ఆశయ సాధనకు కృషి



మచిలీపట్నంలో కొరటాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పిస్తున్న నరసింహారావు, తదితరులు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి : కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ జీవితం నేటి తరానికి ఆదర్శమని , ఆయన ఆశయాల సాధనకు కృషి చేద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. కొరటాల శతజయంతి కార్యక్రమాన్ని ఆదివారం మచిలీపట్నం జోతిబాపూలే విజ్ఞానకేంద్రంలో నిర్వహంచారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సభలో నరసింహారావు మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా, పొలిట్ బ్యూరో సభ్యులుగా కొరటాల పని చేశారని గుర్తు చేశారు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో జైలు జీవితం గడిపారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతు, వ్యవసాయ, చేనేత కార్మికుల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించడంతోపాటు, ఆయా సంఘాల నిర్మాణంలోనూ కొరటాల కీలకపాత్ర పోషించారన్నారు. రైతాంగ ఆత్మహత్యలపై అధ్యయన కమిటీని ఏర్పాటు చేసి సరళీకరణ విధానాలకు ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించారన్నారు. నగర కమిటీ సభ్యులు టి.చంద్రపాల్ మాట్లాడుతూ కొరటాల రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేశారని, ఎంతో నిరాడర జీవనం సాగించారని తెలిపారు. తొలుత నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి నాయకులు నాగయ్య, సిఐటియు నగర కార్యదర్శి జయరావు, ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ విజయలక్ష్మి, కె.సుజాత , కమిటీ సభ్యులు బి.భవానీ, ఎం. పద్మావతి తదితరులు కొరటాల శతజయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** దేశంలో రాజకీయ ప్రణామాలు చాలా వేగంగా మారుతున్నాయని ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టులు అవసరం పెరుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం గన్నవరం సిపిఎం కార్యాలయంలో పార్టీ రాష్ట్ర నేత కొరటాల సత్యనారాయణ శత జయంతి కార్యక్రమం జరిగింది. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోరాటాల ధీరుడు కొరటాల అని చెప్పారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా గ్రామస్థాయి నుంచి ప్రజలను పోరాటాల్లోకి తీసుకురావాల్సిన అవసరం బాధ్యత సిపిఎం నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కామన్ సివిల్ కొడుకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. దేశంలో బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న శక్తులతో కలిసి ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ టీడీపీలు కేంద్రంలోని మోదీతో అంటగాగుతున్నారని విమర్శించారు. వీరు ఆలోచించుకోవాలని సూచించారు. కొరటాల చూపిన ఆశయాల బాటలో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, మిరప నాగేశ్వరరావు, కాసిం, కొండబాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** ఆదివారం గుడివాడ సుందరయ్య భవనంలో కొరటాల సత్యనారాయణ శతజయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొరటాల సత్యనారాయణ చిత్రపటానికి సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు మురళీకష్ణ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ గుడివాడ పట్టణ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ విశిష్టమైన కషి చేశారన్నారు. ఈ కషి యువతరానికి ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు

శత జయంతి వేడుకల్లో వక్తలు



గుడివాడలో...



గన్నవరంలో...



చల్లపల్లిలో...

తమ్మిశెట్టి లక్ష్మణరావు, రేపానికొండ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, ఐద్వా నాయకులు పల్లపు వీరమ్మ, పి రజిని, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎలీషా రావు, పి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ శత జయంతి సభ చల్లపల్లిలోని గుంటూరు బాపనయ్య భవనంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి యద్దనపూడి మధు అధ్యక్షత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ చల్లపల్లిలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి, జమీందారీ మిగులు భూముల పోరాటంలో కొరటాల ప్రత్యక్షంగా పాల్గొన్నారు అన్నారు. జిల్లా నాయకులు వాకా రామచంద్రరావు, మత్రపు పోలి నాయుడు, బండారు కోటేశు, లంకపల్లి సత్య నారాయణ, బళ్ళ వెంకటేశ్వరరావు, గొళ్ళ సాంబశివరావు, పర్జుల్లా, ఉసా వెంకటేశ్వరరావు, ఎండి కరిముల్లా పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కనీస వేతనాలు అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : మున్సిపల్ స్కూల్ ఆయాలకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కృష్ణా జిల్లా గౌరవ అధ్యక్షులు బూర. సుబ్రహ్మణ్యం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆయాలకు కనీస వేతనాలు అమలు, మరియు క్యాజువల్ లీవులు అమలు చేయాలని కోరుతూ మచిలీపట్నం మున్సిపల్ స్కూల్ ఆయాల కమిటీ(సీఐటీయు) ఆధ్వర్యంలో ఆదివారం మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ కు వినతిపత్రం అందించారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుమారుగా 44 మంది స్కూల్ ఆయాలు గత 30 సంవత్సరాల పైబడి నుండి పనిచేస్తున్న వీరికి చాలీ చాలని వేతనం అమలుపరుస్తున్నరన్నారు. స్కూల్ ఆయాలా కమిటీ అధ్యక్షురాలు కొట్టి మీనా కుమారి మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి పని చేస్తున్నామని, మచిలీపట్నం మున్సిపల్లో తక్కువ వేతనంతో తాము పనిచేస్తున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేస్తున్నా మున్సిపల్ రికార్డులలో పార్ట్ టైం అని నమోదు చేయడం వల్ల తక్కువ వేతనాలు ఇస్తున్నారని, వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, నాగలక్ష్మి, కల్పవల్లి వెంకటేశ్వరమ్మ, కుమారి, సిఐటియు మండల కార్యదర్శి సి హెచ్ జయ రావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం చిన్న అవుటపల్లి పుణ్యాచారిటీస్ వృద్ధాశ్రమంలో ఆదివారం శ్రీ దుర్గా ట్యుటోరియల్ కాలేజ్, శ్రీ వెంకటేశ్వర ట్యుటోరియల్ కాలేజ్ 1970 (మెట్రిక్యులేషన్) బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సా హంగా.. ఉల్లాసంగా జరిగింది. నాటి ఉపాధ్యాయులు కీర్తిశేషులు వేమూరి గోపాలరావు, పిచ్చాచార్యులు ఫోటోలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు ముక్కామల ఉమామహేశ్వరరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. మామిడి చెట్ల కింద అందరూ కూర్చుని నాటి తీపి జ్ఞాపకాలను, చిలిపి పనులను గుర్తుచేసుకొని ఆనందించారు. జీవితంలో కష్టపడి ఉన్నత స్థాయికి చేరడటం ద్వారా మరో పదిమందికి ఉపయోగపడాలని అందరూ నిర్ణయించు కున్నారు. ఈ సందర్భంగా పుణ్యాచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయ భూషణ కుమార్ మాట్లాడుతూ..53 సంవత్సరాల క్రితం చదువుకున్న విద్యార్థులంతా ఒకచోటకు చేరుకొని నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం శుభ పరిణామం అన్నారు. ఏడాదికోసారి ఈ విధంగా అందరూ కలుసుకొని తమ ఆనందాన్ని, కుటుంబ విశేషాలను చెప్పుకుని సంతోషంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడవల్లి బాబురావు, చౌదరి, బాబి,లావు చలపతి, సాంబశివరావు, శర్మతదితరులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరరావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గన్నవరం రైల్వేస్టేషన్లో సమస్యల మోత

- దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధికి నోచని వైనం

ప్రజాశక్తి-గన్నవరం : నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం రైల్వేస్టేషన్ పరిస్థితి దయనీయంగా మారింది. స్టేషన్కు వెళ్లేందుకు సరైన రహదారి లేదు. అరకొర ప్యాసింజర్ రైళ్లు మినహా ఎక్స్ ప్రెస్ హాల్ట్ సదు పాయం లేదు. దూర ప్రాంతాలు వెళ్లే ప్రయా ణికులు విజయవాడ , ఏలూరు రైల్వేస్టేషన్లను ఆశ్ర యించాల్సి వస్తోంది. ఈ స్టేషన్ అభివృద్ధి కోరుతూ పలుమార్లు విజ్ఞప్తులు చేస్తున్నప్పటికి పట్టించుకునే అధికారులు లేరు. కనీస సదుపాయలు కల్పించడం లేదు. గన్నవరానికి రెండు కిలోమీటర్ల దూరంలో బ్రిటిష్ పాలకుల కాలంలో నిర్మించిన ఈ రైల్వేస్టేషన్ దశబ్దాలు గడుస్తున్న అభివద్ధికి నోచుకోవడం లేదు. ఈ రైల్వేస్టేషన్ నుంచి నెలకు 6 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణీకుల ఆదరణకు తగినట్టు సదుపాయలు అందుబాటులోకి రావడం లేదు. స్టేషన్ భవనం శిథి లావస్థకు చేరగా మరమ్మతులతో సరిపెడు తున్నారు. ప్రయాణికులు కూర్చునేందుకు సరైన షెడ్లు అందుబాటులో లేవు . ప్రయాణికుల తాగు నీటి అవసరాలను కూడా తీర్చలేని దుస్థితి నెలకొం ది . టాయిలెట్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు . మూడు ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఇక్కడ ఆగుతాయి.ఈ స్టేషన్ మీదుగా రోజూ అధిక సంఖ్యలో ఎక్స్ ప్రెస్ లు ఒకటి ఆడడం లేదు. విజయ వాడ – కాకినాడ పోర్ట్ , విజయవాడ – రాజమండ్రి మధ్య నడుస్తున్న ప్యాసింజర్ రైళ్లు ఉదయం , సాయంత్రం ఇక్కడ హాల్ట్



కల్పించారు. సికింద్రాబాద్, తిరుపతి, విశాఖపట్నం తదితర దూర ప్రాం తాలకు వెళ్లాలంటే విజయవాడ , ఏలూరు రైల్వేస్టే షన్లను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు .

ఫ్లైఓవరకు మెట్లు లేవు ..

సాధరణంగా ఎక్కడైనా రైల్వే క్రాసింగ్ల వద్ద నిర్మించే ఫ్లైఓవరకు ప్రయాణికుల రాకపోకలకు అనువుగా మెట్ల మార్గం ఏర్పాటు చేస్తారు . అయితే ఐదేళ్ల క్రితం రైల్వేస్టేషన్కు అతి సమీపం లో గన్నవరం – ఆగిరిపల్లి ఆర్అండ్బ రహదారిపై రైల్వే క్రాసింగ్ వద్ద వంతెన నిర్మాణం అందుకు భిన్నంగా ఉంది . రైల్వే శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మెట్ల



పాడైపోయిన మరుగుదొడ్లు

మార్గం నిర్మించలేదు . ఫలితంగా ఆర్అండ్ రహదారి నుంచి స్టేషన్కు వచ్చేందుకు ఇక్కడ ఎక్స్ ప్రెస్ లు ఆపాలని,ఈ ప్రాంతం విద్య , వైద్యం , ఇంజినీరింగ్ , ఐటీ పరంగా అభివద్ధి చెందుతుంది . అందుకు తగ్గట్లుగా ఇక్కడ రైల్వేస్టేషన్ అభివద్ధికి నోచుకోవడం లేదు . తిరుమల , సింహాద్రి రైళ్లకు ఇక్కడ హాల్ట్ కల్పించడం వల్ల ఈ ప్రాం త ప్రయాణికులకు ఉపయోగం . గన్నవరం నుంచి రైల్వేస్టేషన్కు దగ్గర మార్గమైన ఐటీఐ కళాశాల రోడ్డును అభివద్ధి చేయాలని అంటున్నారు. పాకుడు పట్టిన కుళాయిలు ప్రయాణికులు కిలోమీటర్ చుట్టూ తిరిగిరావా ల్సిన పరిస్థితి నెలకొంది . స్టేషన్కు వచ్చే రహదారి కూడా రాళు తేలిపోయి అధ్వాన్నంగా తయారైంది . స్టేషన్ మార్గంలో వీధిలైట్లు లేక రాత్రివేళలో చీకట్లో రాకపోకలు సాగించలంటే ప్రయాణికులు భయపడుతున్నారు . మౌలిక సదుపాయలు కల్పించాలి .. రైల్వేస్టేషన్లో మౌలిక సదుపాయల కల్పనపై అధికా రులు దష్టి సారించాలి . తాగునీటి వసతితో పాటు టాయిలెట్స్ మరమ్మతులు చేయించాలి . స్టేషన్కు వచ్చే రోడ్డును అభివద్ధి చేసి , వీధిలైట్లు ఏర్పాటు చేయాలి . ప్యాసింజర్ రైళ్లతో పాటు ఎక్స్ప్రెస్లు ఆపితే ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు ఆలోచించాలని కోరుతున్నారు.

మొదటిపేజీ తరువాయి

పైసా వసూల్..!

పాల్పడినట్లు తెలుస్తోంది. గతంలో ఓ అధికారికి గ్యాస్ కనెక్షన్ పేరుతో మేజర్ పంచాయతీ నుంచి రూ.7,500, మైనర్ పంచాయతీల నుంచి రూ.5 వేలు వసూలు చేయడం చర్చనీయాంశమైంది. స్పందనలో ఫిర్యాదులు వచ్చిన పంచాయతీల కార్యదర్శుల నుంచి పరిశీలనకు ఖర్చవుతుందనే పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అవినీతి ఆరోపణపై సస్పెండ్ అయిన ఓ పంచాయతీ కార్యదర్శి నుంచి రీ జాయినింగ్‌కు రూ.6 లక్షలు వసూలు చేసినట్లు డిపివో కార్యాలయంలో గుసగుసలాడుతున్నారు. కార్యదర్శుల నుంచి ఈవోపిఆర్‌డి ప్రమోషన్ పోస్టింగ్‌లు ఇచ్చే క్రమంలో ఉద్దేశ్యపూర్వకంగా కార్యాలయ సిబ్బంది తీవ్ర జాప్యం చేసి, అడిగినంత ముడుపులు ఇచ్చిన తర్వాతే పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చారనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలోనే త్వరలో జూనియర్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్ టూగా ప్రమోషన్ పొందే వారి జాబితాను సిద్ధం చేసే త్వరలో వారి నుంచి వసూలు చేయాల్సిన రేటును ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. కృష్ణాజిల్లాలో 495 గ్రామ పంచాయతీలున్నాయి. విద్యుత్ బిల్లులు చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లిస్తోంది. కనీస అవసరాలకు నిధులు లేక పంచాయతీల్లో అభివృద్ధి అటకెక్కింది. సర్పంచ్‌లు విమర్శలకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా అధికారి కార్యాలయంలోని కొందరు సిబ్బంది అనధికారిక వసూళ్లకు పాల్పడటం సమస్యగా మారిందని సర్పంచులు వాపోతున్నారు.

అటకెక్కిన ఆనకట్టలు

విడుదల చేసినట్టు సమాచారం. గతేడాది దాదాపు 496.6 టిఎంసిల మిగులు జలాలను బ్యారేజీ నుంచి సముద్రంలోకి దిగువకు విడుదల చేశారు. 2021-22 నీటి సంవత్సరంలో 501.4 టిఎంసిలు, 2020-21లో 1,278.1 టిఎంసిలు సముద్రంలోకి విడుదలయ్యాయి. ఇది గత రెండు దశాబ్దాలలో అత్యధికం. 2019-20లో దిగువకు వదిలిన నీరు 797.1 టిఎంసిలు కాగా 2019-20కి ముందు ఐదేళ్లలో ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడుదల చేసిన మిగులు జలాలు 100 టీఎంసీల కంటే తక్కువగా ఉండటం గమనార్హం. ఇంత పెద్ద మొత్తంలో నీరు వధాగా సముద్రంలోకి కలిసిపోతుండటంతో నదిపై బ్యారేజీలు నిర్మించాలన్న డిమాండ్ ఊపందుకుంది. నిజానికి కృష్ణా డెల్టాలో కొన్నేళ్లుగా ఈ డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో వైసిపి ప్రభుత్వం మూడు బ్యారేజీలను నిర్మించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ప్రకాశం బ్యారేజీకి 16 కిమీ దిగువన కృష్ణాజిల్లా పెనమలూరు మండలం చోడవరం వద్ద 4.131 టిఎంసి నిల్వ కెపాసిటీతో ఒక ఆనకట్టను నిర్మించాలని నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీకి 67 కిమీ దిగువన కృష్ణా జిల్లా మోపిదేవి మండలం బొబ్బర్లంక, గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం ఓలేరు-తూర్పుపాలెంకు మధ్యలో 4.950 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యంతో రెండో బ్యారేజీని నిర్మించాలని నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం దాములూరు వద్ద 10 టిఎంసిల నిల్వ సామర్థ్యం కలిగిన మూడో బ్యారేజీని నిర్మించాలని నిర్ణయించారు. ఈ మూడు బ్యారేజీల ద్వారా ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలోని దాదాపు 320 గ్రామాలకు తాగు, సాగు నీటి సమస్యను తీర్చొచ్చని భావించారు. ఆ మేరకు నీటిపారుదల శాఖ మూడు బ్యారేజీల కోసం వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను (డిపిఆర్) సిద్ధం చేసింది. ఆర్వీ అసోసియేట్స్ ఆర్కిటెక్ట్స్ అండ్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో డిపిఆర్‌లు రూపొందించారు. నిర్ణీత ప్రాంతాల్లో కట్టడాలకు అనువుగా ఉంటుందనే దానిపై డిజిపిఎస్ సర్వే కూడా చేపట్టారు. అందులో భాగంగా క్షేత్ర స్థాయిలో జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్స్, భూ పరీక్షలు నిర్వహించారు. టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణాలకు సంబంధించి పలుమార్లు సమావేశం నిర్వహించారు. 2022-23 ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం ప్రాజెక్టు అంచనాల వ్యయాన్ని కూడా రూపొందించారు. మొదటి బ్యారేజీ నిర్మాణానికి రూ.2235.42 కోట్లు, రెండో బ్యారేజీ నిర్మాణానికి రూ.2526.39 కోట్లు, మూడో దానికి రూ.2514.42 కోట్లు వ్యయం అవుతుందని అంచనాలు తయారు చేశారు. వీటిని ప్రభుత్వానికి కూడా ఇది వరకే పంపారు. కానీ ఇంత వరకు దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈ ప్రాజెక్టుల నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.



చవితి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: తాడేపల్లి విజయవాడ క్లబ్ రోడ్డులో రివర్ గౌతమి రివర్ బ్రిడ్జ్ అపార్ట్మెంట్ ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకలను ఆదివారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ యస్ ఢిల్లీరావు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ప్రాంతాల వారు ఉద్యోగ వ్యాపార రీత్యా అపార్ట్మెంట్‌లో నివాస ముంటారన్నారు. కుల మతాలకు అతీతంగా సమిష్టి గా పండుగలను జరుపుకోవడం ఐకమత్యాన్ని నిదర్శనం అన్నారు. దైనందిన జీవితంలో నిత్యం ఎంతో కొంత మానసిక ఒత్తిడికి గురవుతారన్నారు. ఇటువంటి సామాజిక ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఆనందాన్ని పొందగలుగుతామన్నారు. ప్రత్యేకంగా అలంకించిన మండపంలో ఏర్పాటు చేసిన వినాయకునికి జిల్లా కలెక్టర్ పట్టు వస్త్రం సమర్పించి బెంగుళూరు వంకాయలు, కాప్సికంలతో తయారుచేసిన దండలను సమర్పించారు. అనంతరం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించి అత్యంత వైభవం గా ఊరేగింపు నిర్వహించి గణేష్ నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ సభ్యులు కె.సుధాకరరావు, వెంకటేశ్వర రావు, వివి ప్రసాద్, అడుసుమిల్లి కృష్ణప్రసాద్, ఉయ్యూరు కోటేశ్వరరావు, రామ్ మోహన్, బివి నాగు సుదర్శన్‌రెడ్డి, ఎం రామారావు, మణికుమార్, చలసాని సతీష్, ఎం.మధుబాబు, అట్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక పరిపుష్టే లక్ష్యంగా గ్రామీణాభివృద్ధి

రూ. 907.71 కోట్లు మంజూరు చేయడం జరిగింది. అలాగే గతేడాది 1450 సంఘాలకు రూ.600 కోట్లు, అలాగే 2021-22లో 707.73 కోట్లు మంజూరు చేయడం జరిగింది.

ప్రశ్న: జిల్లాలో వైఎస్ఆర్ ఆసరా పథకం అమలు పరిస్థితిని వివరించగలరు?

మహిళల సంక్షేమం, స్వావలంబన, సాధికారిత ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ ఆసరా పథకాన్ని అమలు జరుపుతుంది. స్వయం సహాయక సంఘాలు బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించి 2019 ఏప్రిల్ 11నాటికి ఉన్న అప్పు నిల్వ మొత్తాన్ని నాలుగు దఫాలుగా నేరుగా సంఘ పొదుపు ఖాతాలకు జమ చేసే విధంగా వైఎస్ఆర్ ఆసరా పథకం ప్రవేశపెట్టి, జిల్లాలో 25,749 సంఘాలకు (2,65,327 సభ్యులు) నేరుగా నాలుగు దఫాలలో పొదుపు సంఘాలకు జమ చేయడం జరుగుతుంది. ఇప్పటి వరకు మూడు విడతల్లో జమ చేయగా, గత మార్చి 25న మూడవ విడతలో 20, 763 గ్రూపులకు రూ. 179 కోట్ల.37 కోట్లు నేరుగా జమ చేయడం జరిగింది. రెండవ విడతలో రూ.275 కోట్లు, మొదటి విడతలో రూ. 271 కోట్లు జమ చేయడం జరిగింది.

ప్రశ్న: వైఎస్ఆర్ చేయూత ద్వారా ఎంత మంజూరు చేశారు?

ప్రభుత్వం ప్రకటించిన నవరత్నాల్లో భాగంగా వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా 45 నుంచి 60 సంవత్సరాలు వయస్సులో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన పేద మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగు సంవత్సరాల కాలంలో రూ. 75 వేల చొప్పున ఆర్థిక సహాయం చేయడం జరుగుతుంది. గడిచిన 2020-21 నుంచి 2022-23 మధ్య కాలంలో మూడు విడతల్లో జిల్లాలోని 2,69, 656 మంది పేద మహిళలకు రూ.505.67 కోట్లు ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు.

ప్రశ్న: చేయూత-ఆసరా పథకం ద్వారా ఎంత మంది జీవనోపాధి లభించింది?

ఈ పథకం ద్వారా తమ జీవనోపాధి కార్యక్రమాలను మెరుగుపరుచుకోవడం కోసం ఆవులు, బర్రెలు, గొర్రెలు, మేకలు కొనుగోలు చేయడానికి ఆసక్తి గల లబ్దిదారులను రైతు భరోసా కేంద్రం ద్వారా గుర్తించడం జరుగుతుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 4000 చేయూత, ఆసరా లబ్దిదారులకు లక్ష్యముగా కేటాయించడమైనది. చేయూత పథకంలో 1215 మంది ఆసక్తి కలిగిన లబ్దిదారులను గుర్తించడం జరిగింది. ఆసరా పథకం నుంచి మరో 3000 మంది లబ్దిదారులను గుర్తించడమైనది. వీరికి శ్రీనిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజి , సిబయఫ్ ద్వారా రుణ సదుపాయం కల్పించి, గ్రౌండింగ్ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయడమైనది.

ప్రశ్న: జగనన్న తోడు చిరు వ్యాపారులకు ఏమేరకు ఉపయోగకరంగా ఉంది?

చిరు వ్యాపారుకు ప్రభుత్వం రూ.10 వేల వరకు వడ్డీ లేని రుణం ఇవ్వడానికి జగనన్న తోడు పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. జిల్లాలో 2021-22 సంవత్సరానికి 20,648 మంది చిరు వ్యాపారులకు రూ.20.65 కోట్లు, రెండవ విడత జగనన్న తోడు పథకం కింద 9,003 మంది లబ్దిదారులకు రూ. తొమ్మిది కోట్లు, ఐదవ విడత ఈ పథకం ద్వారా బ్యాంక్ వారి సహకారంతో 7,834 మందికి రూ.7.83 కోట్లు 2022-23 సంవత్సరానికి అందించడం జరిగింది.

ప్రశ్న: పిఎంఎఫ్ఎంఇ గురించి వివరించగలరు?

జిల్లాలో సూక్ష్మ ఆహార శుద్ధి రంగంలో యూనిట్లు నిర్వహిస్తున్న 238 మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు మూలధనం, ఉపకరణాల కొనుగోలుకు ఒక్కొక్కరికి రూ. 40 వేల వరకు మొత్తం రూ.0.88 కోట్లు ను లోన్ రూపంలో ప్రధాన మంత్రి -సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్దీకరణ పథకం (పిఎంఎఫ్ఎంఇ) ద్వారా అందించడం జరిగింది. ప్రతి మండలం నుంచి కనీసం ఐదు యూనిట్లకుప్రధాన మంత్రి -సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్దీకరణ పథకం (పిఎంఎఫ్ఇ) ద్వారా ఆర్థిక సమాయం అందజేయడానికి లక్ష్యం నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 51 మంది లబ్దిదారులకు రూ.107.04 లక్షల మొత్తం బ్యాంక్‌ల ద్వారా యూనిట్లు గ్రౌండింగ్ జరిగింది.

ప్రశ్న: జగనన్న ఇళ్ల పురోగతి ఎలా ఉంది?

ఈ పథకం ద్వారా ఎన్‌టిఆర్ జిల్లాలోని 16 మండలాలకు గాను 11 మండలాల్లో 24, 980 మంది లబ్దిదారులకు ఎంసిపిలు చేసి వివిధ బ్యాంక్‌ల ద్వారా లబ్దిదారులకు లోను ఇప్పించడం జరిగింది. ఇళ్ల నిర్మాణం పురోగతిలో ఉంది.వీటితోపాటు బ్యాంక్ లింకేజి, సున్నా వడ్డీ, ఉన్నతి, స్త్రీ నిధి, రైతు ఉత్పత్తి దారుల సంస్థలు (ఎఫ్‌పిఒ) తదితర స్కీమ్స్‌ద్వారా లబ్దిదారులకు వివిధ రూపాల్లో ఆర్థిక సదుపాయం కల్పించడం జరుగుతుంది.

అంగన్‌వాడీలపై నిర్బంధం

చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావును గృహ నిర్బంధం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ, నాయకులు బేబిరాణిని, స్థానిక ఎంబివికె కార్యాలయం వద్ద రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు ముగ్గురిని అరెస్ట్ చేసి గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సింగ్‌నగర్‌కు చెందిన పలువురు మిడ్డేమీల్స్ కార్మికులను నున్న పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రామవరప్పాడు రింగ్ వద్ద వాహనాలను నిలుపుదల చేసి నాయకులను అరెస్ట్ చేసి, ఆయా స్టేషన్లకు తరలించారు. ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా వంద మందిని పైగా అరెస్ట్ చేసినట్లు సమాచారం. మైలవరంలో పోలీస్‌స్టేషన్‌లో మధ్యాహ్న భోజన సంఘం నాయకులు శేషమ్మకు బిపి పెరగడంతో అస్వస్థతకు గురయ్యారు. ఆమెను దగ్గరలోని ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

కృష్ణాజిల్లాలో మొత్తం 1700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో 3,200 మంది వర్కర్లు, హెల్పర్లు మినీ వర్కర్లు పనిచేస్తున్నారు. ఆరు నెలలుగా అద్దె అంగన్‌వాడీ కేంద్రాలకు, కూరగాయలు, గ్యాస్ బిల్లులను ప్రభుత్వం జమ చేయలేదు. 2017 నుంచి టిఎ, డిఎ బిల్లులు చెల్లించలేదు. 2020 నుంచి జిల్లాలో రిటైర్ అయిన 150 మంది వర్కర్లకు రిటైర్ మెంట్ బెనిఫిట్స్ అందజేయలేదు. అంగన్‌వాడీ వర్కర్‌గా వేతనం జమ చేసే బ్యాంకు అకౌంట్‌లోనే ఈ బెనిఫిట్స్ జమ అవుతాయి. ఈ నేపథ్యంలో ఈ అకౌంట్లు క్లోజ్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో వృద్ధాప్య పింఛను ఇతర పథకాలు వర్తించక వీరంతా నష్టపోతున్నారు. తెలంగాణకన్నా రూ.వెయ్యి అదనంగా వేతనం ఇస్తామని ఇచ్చిన పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వత విస్మరించారు. సుప్రీం తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా చేయాలని, రిటైర్ అయిన వారికి జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, సెల్ ఫోన్‌లో వివిధ రకాల యాప్‌లు తొలగించి ఒకే యాప్ అందుబాటులో ఉంచి నాణ్యమైన ఫేడ్ అందించాలనే డిమాండ్ల పరిష్కారానికి అంగన్‌వాడీలు ఆందోళన బాట పట్టారు.

అక్రమ అరెస్టులను ఖండించండి : సిఐటియు

అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తల అక్రమ అరెస్టులను సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రమాదేవి ఒక ప్రకటనలో ఖండించారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగనవాడీ వర్కర్లు ఈ నెల 25న విజయవాడలో ధర్నాకు పిలుపునిచ్చారని, ధర్నాకు అనుమతించాలని కోరుతూ పోలీసులను ముందుగానే రాత పూర్వకంగా కోరారని తెలిపారు. కానీ పోలీసులు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ధర్నాకు అనుమతిలేదంటూ అంగనవాడీ నాయకులను ముందస్తుగా అక్రమ అరెస్టు చేయడం ప్రజా ఉద్యమాలను అణిచివేయడమేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా పోలీసులను ఉపయోగించి నిర్బంధించడం సహేతుకం కాదని తెలిపారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు అడ్డంకులను అధిగమించి సోమవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు.



మైలవరంలో పోలీస్‌స్టేషన్‌లో బిపి వచ్చి కుప్పకూలిన అంగన్‌వాడీ శేషమ్మ


ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల్లో కేంద్రంలోని బిజెపిని గద్దెదించడమే ప్రధాన లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేస్తూ ప్రజాపునాదిని నిలబెట్టుకోవాలని కోరారు. కార్పొరేట్ అనుకూల విధానాలు, మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా పార్టీ, ప్రజాసంఘాలు ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలన్నారు. ఉద్యోగ, కార్మిక సమస్యలను ఎజెండాగా తీసుకొని బిజెపి విధానాలను ఎండగట్టాలన్నారు. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని ఆయా డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయిలో రాజీలేని పోరాటాలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, బోయి సత్యబాబు, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి రమణారావు, నాయకులు టి ప్రవీణ్, పి.కృష్ణ, ఎం.వి సుధాకర్, ఎం.సీతారాములు, కాజా సరోజ, ఝాన్సీ, వై.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

12వ రోజుకు రిలే దీక్షలు



అవనిగడ్డలో...



పెదపారుపూడిలో..

ప్రజాశక్తి-గుడివాడ : మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో 12వ రోజు రిలే నిరాహార దీక్షలను ఐటిడిపి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దీక్షలు చేస్తున్న నాయకులకు పట్టణ, రూరల్, నందివాడ మండలాల అధ్యక్షులు దింట్యాల రాంబాబు వాసే మురళీ, దానేటి సన్యాసిరావులు పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. సర్పంచ్ కాకరాల సురేష్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు గోవాడ శివా, నాయకులు షయ్యద్ జబీన్, సింగవరపు ప్రభాకర్, షేక్ జానీషరీఫ్, రెడ్డి షణ్ముఖ, కంచర్ల సుధాకర్, మచిలీపట్నం పార్లమెంట్ ఐ టిడిపి అధ్యక్షులు ఉప్పలపాటి ప్రవీణ్ పాల్గొన్నారు.అలాగే రూరల్ మండలంలోని బోమ్ములూరు గ్రామంలో మండల అధ్యక్షుడు వాసే మురళీతో కలసి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు కరపత్రాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ శొంటి నాగేశ్వరరావు, బూత్ కన్వీనర్ శొంటి గంగాధర్, రమేష్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : మండల పరిధిలోని కాటూరులో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆదివారం రిలేదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కాటూరు శరత్, మాజీ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాసరావు, సజ్యా సత్యనారాయణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి** : కడిగిన ముత్యంలా చంద్రబాబు బయటకి రావడం తథ్యం పామర్రు టిడిపి ఇన్చార్జ్ వర్ల కుమార్ రాజ అన్నారు. ఆదివారం పెదపారుపూడి మండలం చినపా రపూడి గ్రామంలో కుమార్ రాజా ఆధ్వర్యంలో "బాబుతో నేను" రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి ,మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, మొవ్వ మండల పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వర రావు, మైనేని ఇందిరా ,మండల పార్టీ కార్యదర్శి మసిముక్కు రాంబాబు , మాజీ సర్పంచ్ మల్లీనేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి పానుగంటి సందీప్ , నాగనబోయిన గాంధీ, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు ,గ్రామ పార్టీ అధ్యక్షులు జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి** : మోపిదేవి మండలం బొబ్బర్లంక వద్ద కష్ణానదిలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు జల దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి మండల టిడిపి అధ్యక్షులు నడకుదుటి జనార్దన్ రావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి రావి రత్నగిరి, కృష్ణకుమారి, రావి నాగేశ్వరరావు, జడ్పిటిసి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం పంచాయతీ పరిధిలోని రెండో వార్డుకు చెందిన బీసీ సంఘాల నాయకులు దీక్షలో పాల్గొన్నారు. దీక్షలను పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రాం దీక్షలను ప్రారంభించారు. కాగా దీక్షలో రెండవ వార్డుకు చెందిన బీసీ సంఘాల నాయకులు మైలా హరిబాబు, నడకుదుటి ఈశ్వరరావు, నాగిడి గోవిందరాజులు, సైకో శ్రీనివాసరావు, మోకా శ్రీనివాసరావు, నడకుదుటి ఏడుకొండలు, నాగినేని చిరంజీవి, మచ్చ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని దీక్షలకు సంఘీభావం తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

విద్య, ఆరోగ్యం అందరికీ అందాలి : ఎంపిపి

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్య, ఆరోగ్యం ప్రతివారికి అందాలని, వైయస్ జగన్మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారని పమిడిముక్కల మండల పరిషత్ అధ్యక్షురాలు కాసాని వేద సుప్రజ అన్నారు. ఆదివారం పమిడి ముక్కల మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుల రెండు సంవత్సరాల పూర్తి అయిన సందర్భంగా కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరంకి, పమిడిముక్కల, లంకపల్లి గ్రామాల్లో నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చా మన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్యలు రాకుండా బోరు పంపులు వేయించామన్నారు. ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ గడపగడపకు కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను గుర్తించి సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. గాంధీజీ కలలకున్న స్వరాజ్యం రావడానికి సచివాలయ వ్యవసను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, వాలంటరీల ద్వారా కుటుంబాలకు సేవలు అందిస్తున్నారని తెలి పారు. ఈ కార్యక్రమంలో మండల ఉప అధ్యక్షులు కొడ మంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, మండల అభివద్ధి అధికారి విటల్ పాల్, ఎంపిటిసి సభ్యులు రాజ్యలక్ష్మి, అంక కుమారి, గురువిందపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పాల పొంగళ్ళు సమర్పించి వారి యొక్క మొక్కుబడులను తీర్చుకున్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి, ఏర్పాట్లు పరిశీలించినట్లు తెలిపారు. అలాగే అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9 గంటల కు దేవాదాయ శాఖ అధికారులు మరియు ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో లెక్కింపు చేయనున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపో నందు సోమవారం డైల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 12 గంటల నుండి ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని చెప్పారు. అందువల్ల అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని ప్రజలు తమ ప్రయాణ అవసరాలపై సూచనలు సలహాలు ఫోన్ ద్వారా తెలియజేయవలసిందిగా కోరారు. ప్రయాణికులు 995922 5466 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని మేనేజర్ కోరారు

ప్రకాష్‌బాబు మృతికి ఎంఎల్ఎ సంతాపం

ప్రజాశక్తి-అవనిగడ్డ : రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎన్ జే ఎస్ ప్రకాష్ బాబు శనివారం హార్ట్ ఎటాక్ తో మృతిచెందారు. ఆదివారం ప్రకాష్ బాబు మతదేహాన్ని సందర్శించి పూలదండలు వేసి నివాళు లర్పించారు. ప్రకాష్ బాబు సిబిసిఎంసి పాఠశాలకు కరస్పాండెంట్ గా సేవలందించడంతోపాటు ఏపీటీఎఫ్ కృష్ణాజిల్లా నాయకుడిగా వివిధ హెూదాలలో పనిచే సి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన మతికి అవనిగడ్డ లోని ప్రముఖులు కష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ కడవకొల్లు నరసింహారావు, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీపీ దొంగల సమితి దేవి, ప్రముఖ పారిశ్రామికవేత్త పరుచూరి దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు కడప గురవయ్య, లలితదేవి, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎంవి కష్ణారావులతోపాటు పలువురు నియోజకవర్గంలోని ప్రముఖులు ప్రకాష్ బాబు కు నివాళులర్పించారు.

పరిశుభ్రతకు సహకరించాలి

ప్రజాశక్తి-విజయవాడ : నగర పరిశుభ్రతకు నగర వాసులు సహకరించాలని పలువురు కార్పొరేటర్లు పేర్కొన్నారు. ఇండియన్ స్వచ్ఛత 2.0 లో భాగంగా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఆయా సర్కిల్స్ పరిధిలోని ఆయా డివిజన్లలో ఆదివారం పలు కార్యక్రమాలు జరిగాయి. నగరంలోని 62 డివిజన్ రాధానగర్ కార్పొరేటర్ విజయలక్ష్మి , 35వ డివిజన్ కార్పొరేటర్ బాలసాని మాణెమ్మ, 45వ డివిజన్ భగత్ సింగ్ నగర్ కార్పొరేటర్ మాధురి లావణ్య, ఎనిమిదవ డివిజన్ అశోక్ నగర్ లో ఉన్న స్థానిక అపార్ట్మెంట్ వాసులు, 39 వ డివిజన్ షాది ఖానా రోడ్ భవానిపురంలో సీఎం ఓహెచ్ డాక్టర్ పి రత్నావళి వారి బందంతో స్వచ్ఛత ఈ సేవ అంటూ ఆయా డివిజన్లలో చీపుర్లు పట్టుకుని పరిసరాలను శుభ్రపరిచారు. పెరుగుతున్న కాలుష్యం నుండి మనల్ని మనం కాపాడుకోవాలంటే మొక్కలు నాటడం చాలా ముఖ్యమె నదని కార్పొరేటర్లు అన్నారు. ఆయా డివిజన్లలో 100కు పైగా మొక్కలను నాటారని, మరిన్ని మొక్కలు నాటాలని కోరారు. కాలుష్యాన్ని నివారించేందుకు నగర పౌరులకు భాగస్వామ్యం కావాని కోరారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - నందిగామ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి న్యాయశాఖ ద్వారా పూర్తి సహకారం అందిస్తామని నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.తిరుమలరావు పేర్కొన్నారు. నందిగామ మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో నందిగామ మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.తిరుమలరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు తమ హక్కుల కోసం కార్మిక చట్టాల గురించి అవగాహన పెంచుకోవా లని కోరారు. భవన నిర్మాణ కార్మికులు వత్తి నైపుణ్యం పెంచుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి ఎదగవచ్చని వివరించారు. ఎటువంటి సమస్యలు వచ్చినా కార్మికులు న్యాయస్థానాన్ని సంప్రదించొచ్చని తెలిపారు. పలువురు భవన నిర్మాణ కార్మికులు నాయకులు మాట్లాడుతూ భవనిర్మాణ కార్మికులకు దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న క్లైములు ప్రభుత్వం నుండి వచ్చే విధంగా కషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక శాఖ అధికారులు న్యాయస్థానం వద్దకు పిలిపించి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం జరిగే విధంగా కషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బొందలపాటి రామకష్ణ, కెవిఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రిటైర్డ్ తుర్లపాటి కోటేశ్వరరావు, న్యాయవాదులు, సిహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్‌వి రావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : చిట్టినగర్ కెఎల్ రావు నగర్‌లో రాకేష్ పబ్లిక్ స్కూల్ నిర్వాహకులు, డైరెక్టర్ ఎన్.వి. రావు డాక్టరేట్ పొందిన సందర్భంగా విజయవాడ చిల్డ్రన్, స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ ఓబా సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. విజయవాడ చిల్డ్రన్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్ ఓబా డివిజిన్ సమావేశం ఆదివారం చిట్టినగర్ కెఎల్ రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో ఓబా అధ్యక్షురాలు ఎమ్.డి. షాహీన్ అధ్యక్షతన సమావేశం జరిగింది, ఈ కార్యక్రమానికి రాకేష్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత, లయన్ డా. ఎన్.వి. రావు ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలోని వన్‌టౌన్, భవానీపురం, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాలలో పాఠశాలలు నిర్వహించే ఓబా సభ్యుల ద్వితీయ సర్వసభ్య సమావేశం జరుపుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతుల నిర్వహణ, బాలోత్సవ్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. రాయల్ పబ్లిక్ స్కూల్ అధినేత, ఓబా అధ్యక్షురాలు ఎం.డి. షాహీన్, షిరిడి సాయి స్కూల్



ఎన్.వి రావును సత్కరిస్తున్న ఓబా సభ్యులు

అధినేత, కార్యదర్శి ఎ. శ్యామలా, ఎస్‌విఆర్ పబ్లిక్ స్కూల్ నిర్వాహకురాలు, కోశాధికారి పి. విజయలక్ష్మి మాట్లా డుతూ చిల్డ్రన్స్, స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ నిర్వహణ బాధ్యతతో వ్యవహరిస్తూ పిల్లలను తీర్చిదిద్దు తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల డాక్టరేట్ పొందిన రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్.వి. రావును ఓబా సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శారదా విద్యాలయం డైరెక్టర్లు పి. మురళీధర్, చక్రధర్, కెబి టాలెంట్ స్కూల్ ఎస్.కె. జిలాని, కూరపాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ యుగంధరాచార్యులు, అరుణా కాన్వెంట్ దుర్గారావు, నారాయణ స్కూల్ శ్యామ్‌సుందర్, వావ్‌కిట్ స్కూల్ శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పై అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అసత్య ప్రచారాలు మానుకోవాలని లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకుంటారని జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు హెచ్చరించారు. ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఎమ్మెల్యే ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పవన్ కళ్యాణ్ పై అవాకులు చవాకులు పేలుతున్నారని, ఆయన రెండు చోట్ల ఓడిపోయారంటూ హేళనగా మాట్లాడడం తగదన్నారు. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఎన్నికలలో పాల్గొనే మీరు పవన్ కళ్యాణ్ ని విమర్శించే అర్హత ఎక్కడ ఉందన్నారు. అలాగే 22 ఏ భూముల సమస్య పరిష్కరించినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని అందులో ఉన్న 60 రకాల భూముల్లో కేవలం ఒకే ఒక్క రకం కండిషన్ పట్టాలకు సంబంధించిన భూమి సమస్య మాత్రమే పరిష్కారం అయిందని, అది అవనిగడ్డ మండలంలో ఒక్క ఎకరం కూడా దానివల్ల పరిష్కారమైన సందర్భం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, కటికల వసంత్, వార్డు సభ్యులు అడపా ప్రభాకర్, కమ్మిలి సాయి, భార్గవ తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి వత్సవాయి : ఈనెల 25న విజయవాడ అలంకారి సెంటర్లో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు వత్సవాయి మండల సిఐటియు మండల కార్యదర్శి బి రాము కోరారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయా లని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యో గులను పర్మినెంట్ చేస్తాం అన్న ప్రభుత్వం హామీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐకానిక్ బకెట్‌తో కెఎఫ్‌సి ఉత్పత్తులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కెఎఫ్‌సి రెస్టారెంట్ ఐకానిక్ బకెట్‌తో కెఎఫ్‌సి ఉత్పత్తులను అందించ నున్నట్లు సంస్థ రీజనల్ ప్రతినిధి ఈశ్వర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కెఎఫ్‌సి రెస్టారెంట్‌లలో ప్రత్యేకంగా రూపొందించిన సైన్ లాంగ్వేజ్ బకెట్ ద్వారా సాధారణంగా ఉపయోగించే పదాలు ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా రూపొందించినట్లు తెలిపారు. ఇపుడు నూత నంగా హలో, ప్లీజ్, గుడ్ మార్నింగ్, ఎలా ఉన్నారు, హ్యావ్ ఎ గుడ్ డే, వాట్స్ అప్ పేర్లతో వినూ తనంగా ఆకట్టుకునేలా బకెట్లపై ముద్రించి వినియో గదారులకు కెఎఫ్‌సి రెస్టారెంట్‌లలో అందిస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న సినీ దర్శకులు బి.వీర శంకర్

సృజనాత్మకతకు అద్దంపట్టేలా

లఘు చిత్రాల ప్రదర్శన

విజయవాడ : చిన్న చిత్రం, పెద్ద సందేశం పేరుతో గత 2 రోజుల నుండి మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు ఈరోజు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ రోజు 15 లఘు చిత్రాల ను, 20 రీల్స్ ను ప్రదర్శిచారు.లఘు చిత్రాలు కేటగిరీలో ఉత్తమ చిత్రాలుగా నాన్న,వనమాలి, జన్మనిచ్చిన తల్లి, రేర్ ఎర్త్, ఆర్.టి. ఐ చిత్రాలు ఎంపిక అయ్యాయి. స్పెషల్ జ్యూరీ విభాగంలో మైత్రి, ఒడి, భూమి, అణగారిన జీవితంలో అక్షర జ్యోతి, శ్వర నివాళి ఎంపిక అయ్యాయి. ఉత్తమ చిత్రాలకు 5 వేల రూపాయల నగదు బహుమతి, స్పెషల్ జ్యూరీ లో ఎన్నికయిన 5 చిత్రాలకు 1వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రముఖ సినీ దర్శకులు బి.వీర శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. షార్ట్ ఫిలిం అనేది ఒక పవర్‌ఫుల్ మీడియా అలాంటి చిన్న సినిమాని చాలా ఉత్సాహంగా తమ సజనాత్మకతతో తీస్తున్న సజపరులైన వారందరికి అలాగే దాన్ని ప్రోత్సహిస్తున్న ప్రేక్షకులకు తెలుగు సినిమా పరిశ్రమ తరపున నేను కతజ్ఞతలు తెలియజేస్తాను. ఈ రోజు ప్రదర్శించిన షార్ట్ ఫిలిమ్స్ ఉరకలేత్తిన యువకులే చాలా మంది చేశారు. వాళ్ళందరికీ ప్రత్యేకంగా అభినందన తెలియజేశారు. ఒక ప్రజానాట్యమండలి పునాదుల మీద ఏర్పడిన ఇలాంటి షార్ట్‌ఫిలిం సంస్థ ఆధ్వర్యంలో మంచిమంచి సినిమాలు తీసి ప్రదర్శిస్తున్న వారందరికీ తన ధన్యవాదాలు తెలియజేసారు. రామ్ భీమన 2011లో తీసిన సినిమా షార్ట్ ఫిలిం వల్లే కొన్ని మిలియన్ మంది చూసారు. అతనికి డైరెక్షన్ అవకాశం తీసుకొచ్చింది. విజయవాడలో మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియం లాంటి అధ్భుతమైన ఆడిటోరియం ఉండటంకూడా ఫిలిం మేకర్స్‌కు ఎంతో ఉపయోగపడు తుందన్నారు. ఈ సంస్థ ఇక్కడ ఉన్న పెద్దలు అందరు కూడా వాళ్ళందరి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రముఖ సినీ దర్శకులు రామ్‌భీమన, దేవిప్రసాద్ తమ సందేశాలను పంపి అభినందనలు తెలియజేశారు. ఈ సభకు తెలుగు షార్ట్ ఫిల్మ్ గౌరవాధ్యక్షులు ఎడ్ల పార్ధ సారధి, కార్యదర్శి డి.వి.రాజు. అధ్యక్షులు బి.కె.ఎన్.ఎస్.ప్రసాద్, ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు గోళ్ళ నారాయణ రావు, ఎం.బి.వి.కే కార్యదర్శి పిన్నమనేని మురళీకష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన క్రీడాకారులు

నేటి నుంచి టెన్‌పిన్ బౌలింగ్ పోటీలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు బెంగళూరులో జరుగుతున్న 32వ నేషనల్ టెన్‌పిన్ బౌలింగ్ ఛాంపియన్‌షిప్ (టి.బి.ఎస్.ఐ)కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఒక మహిళ సహా 8మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని టీబీఎస్‌ఐ ప్రధాన కార్యదర్శి దిల్‌బిర్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టి.బి.ఎస్.ఐ.లో పాల్గొంటున్న క్రీడాకారుల్లో వర్షిత్ గుడివాడ, గౌతమ్ అభిలాష్ ఊసా, సాయికుమార్ తంగెళ్ళముడి, ప్రహ్లాద్ అమరా, పవన్ అంబుల, షేక్ అబ్దుల్ ముజీద్, ప్రవీణ్ తుంగల, మహిళల కేటగిరిలో సుమతి నల్లబంటు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారుల్లో మహిళా విభాగం నుంచి హాజరవుతున్న సుమతీ నల్లబంటు ఇప్పటికే మూడుసార్లు నేషనల్ ఛాంపియన్‌గా నిలిచారని తెలిపారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోరంకిలోని స్కాట్ స్ప్రైన్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి చెస్ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వివిధ ఏజ్ గ్రూపు విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో 100 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారని చెస్ అసోసియేషన్ సెక్రటరీయన్ యం.ఫణికుమార్ తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 15 నుండి నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కృష్ణా జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రంలో స్కాట్ స్ప్రైన్ స్కూల్ సీఈవో కె.జాహ్నవి, స్కూల్ ప్రిన్సిపాల్ సి.హెచ్.ప్రతిమ, పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమి అధ్యక్షురాలు జె.సౌజన్య, కొటాక్ బ్యాంక్ మేనేజర్ వరప్రసాద్, గుడివాడ చెస్ మేనేజర్ సుమన్, కృష్ణా జిల్లా చెస్ మేనేజర్ రామకృష్ణ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతల వివరాలను నిర్వాహకులు తెలియచేశారు.

విజేతలు....

అండర్ -6 బాలికల గ్రూప్‌లో డివిషా చౌదరి, జ్ఞాన సంపద, అస్విక మొదటి మూడు స్థానాలు సాధించగా, బాలుర విభాగంలో సుహ్రిత్.కె, దక్షిత్ కుమార్, రేయాన్ష్ శ్రీ మొదటి మూడు స్థానాలు సాధించారు. అండర్ -8 కు సంబంధించి బాలికల విభాగంలో వెనోరి సామ్, స్రుతిక, యశశ్వి, మొదటి మూడు స్థానాలు సాధించగా, బాలుర విభాగంలో శ్రీ వశిష్ట,



చెస్ విజేతలుగా నిలిచిన విద్యార్థులు

శ్రేయాష్, అశ్విక్ జాయ్, మొదటి మూడు స్థానాలు సాధించారు. అండర్ -10 ఏజ్ గ్రూప్ బాలికల విభాగంలో సోనిక సాయి, సంజన, లీనా షారోజ్ మొదటి మూడు స్థానాలు సాధించగా, బాలుర విభాగంలో తేజా వజ్రాక్ష, అభిరామ్, సుహాస్ మొదటి మూడు స్థానాలు సాధించారు. అండర్ -12 ఏజ్ గ్రూప్‌లో బాలికల విభాగంలో జోస్లిన్ ప్రహర్ష, గీతార్ధ, లౌక్య మొదటి మూడు స్థానాలు సాధించగా, బాలుర విభాగంలో తాడి జివితేష్, దేవేష్, దుర్గా కృష్ణా మొదటి మూడు స్థానాలు సాధించారు. అండర్ -14 ఏజ్ గ్రూప్‌లో బాలికల విభాగంలో సంజన ప్రియ, లికిత ఎం.విష్ణు ప్రియ, మొదటి మూడు స్థానాలు సాధించారు. బాలుర విభాగంలో తిజేష్ నాగ్ మునగాల, పూరజ్ నాగ్, దానిష్ మొదటి మూడు స్థానాలు సాధించారు. అండర్ -16 ఏజ్ గ్రూప్ బాలుర విభాగంలో వెంకట రాహుల్ ప్రథమ స్థానం సాధించాడు.

ముగిసిన రెజ్లింగ్ పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : మూడు రోజులపాటు ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడరూరల్ మండలం నున్న వికాస్ విద్యాసంస్థల ఆవరణలో నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అండర్ - 14, 17 విభాగాల బాలబాలికల రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో అండర్ - 14 బాలుర టైటిల్‌ను ఉమ్మడి కృష్ణాజిల్లా కైవసం చేసుకుంది. రెండు బంగారు పతకాలతోపాటు నాలుగు రజత, రెండు కాంస్య పతకాలతో బాలుర జట్టు 160 పాయింట్లు సాధించి ప్రథమస్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. అలాగే బాలికల విభాగంలో చిత్తూరు జట్టు ఛాంపియన్‌గా నిలవగా, అండర్ -17 బాలుర టైటిల్‌ను నెల్లూరు జిల్లా, బాలికల ఛాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం జిల్లా కైవసం చేసుకున్నాయి. హోరాహోరీగా సాగిన రెజ్లింగ్ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. రెజ్లింగ్ క్రీడాకారులు గెలుపు కోసం హోరాహోరీగా పోరాడటంతో శనివారం తెల్లవారుజాము రెండు గంటల వరకు మ్యాచ్‌లు జరిగాయి. ఆ తర్వాత జరిగిన ముగింపు కార్యక్రమంలో ఛాంపియన్‌షిప్‌లతో పాటు విజేతలకు పతకాలను వికాస్ విద్యా సంస్థల కార్యదర్శి నరెడ్ల సత్యనారాయణరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో మంచి ప్రతిభను కనబరచాలన్నారు. క్రీడలలో పతకాలు సాధిస్తేనే మంచి గుర్తింపు వస్తుందనే విషయాన్ని విద్యార్థులు మరువకూడదని ఆయన సూచించారు. క్రీడలకు కేంద్ర, రాష్ట్ర



గెలుపొందిన జట్టుతో విద్యా సంస్థల కార్యదర్శి నరెడ్ల, తదితరులు

ప్రభుత్వాలు మంచి ప్రోత్సాహం అందిస్తున్నాయని, అందుకు తగ్గట్టుగానే క్రీడాకారులు కూడా చక్కని ప్రతిభను కనబరిచారన్నారు. అంతర్జాతీయంగా రాణించి డిప్యూటీ కలెక్టర్ పోస్టులు పొందిన క్రీడాకారులను నేటితరం క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పరిశీలకులు రమేష్, రాజు, టోర్నమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శులు టి.విజయ వర్మ, టి.శ్రీలత, శాప్ రెజ్లింగ్ కోచ్ మనోహర్, ఆంధ్రప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భూషణం, వ్యాయామ అధ్యాపకులు ఆనంద్, సీనియర్ కోచ్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి బిగాస్ ఎలక్ట్రిక్ స్కూటర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ ఎలక్ట్రిక్ స్కూటర్ బ్రాండ్ బిగాస్ కంపెనీ కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ 'సి12ఐ'ని నగర మార్కెట్లోకి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాల మురళీకృష్ణ ఆవిష్కరించారు. రామవరప్పాడు రింగు వద్ద గల హితికా మోటార్స్ ఆధ్వర్యంలో బిగాస్ ఎలక్ట్రిక్ స్కూటర్లను ఆదివారం ఉదయం విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాల మురళీకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రతి ఒక్కరూ వాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇటీవల కాలంలో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం సంఖ్య పెరుగుతుందని తెలిపారు. హితిగా మోటార్స్ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను మార్కెట్లోకి తీసుకురావడం పట్ల నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. హితికా మోటార్స్ మేనేజింగ్ పార్టనర్ హర్ష వర్ధన్ మాట్లాడుతూ బిగాస్ సి12ఐ ఎలక్ట్రిక్ వాహనం డిజైన్ పరంగా దేశంలో అత్యంత ప్రత్యేకమైన స్కూటర్లలో ఒకటి అన్నారు. అత్యాధునిక ఫీచర్లతో మార్కెట్లోకి తీసుకువచ్చారని ఇది అందరినీ అకట్టుకుంటుందని తెలిపారు. ఈ వాహనం కేంద్ర ప్రభుత్వం వారి ఫేమ్2 సబ్సిడీతో వస్తుందన్నారు. సి12ఐ వాహనం 85 కిలో మీటర్ల ఎఆర్ఎఐ సర్టిఫైడ్ శ్రేణి కలిగి ఉందని,



స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాల మురళీకృష్ణ

రెగ్యులర్, రోజువారి ప్రయాణాలు, వాణిజ్య ప్రయోజనాల కొరకు కూడా ఉపయోగించవచ్చని తెలిపారు. అతి తక్కువ డౌన్ పేమెంట్ రూ.4,999లకు లభిస్తుందని, ఎక్స్చేంజి సౌకర్యం కూడా ఉందని తెలిపారు. వివరాలకు రామవరప్పాడు రింగు వద్ద గల హితికా మోటార్స్ నందు సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హితికా మోటార్స్ సీఈవో పి.హారిక , పి.వి. సత్యనారాయణ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



చిన్నారులు గీసిన చిత్రాలు

నారాయణ ఈ టెక్నోలో ఫన్ విత్ లెర్న్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రైతు పేట నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో ఆదివారం ఫన్ విత్ లెర్న్ అనే కాన్సెప్ట్‌తో వినూత్న కార్యక్రమం జరిగింది . ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి మాట్లాడుతూ చిన్న పిల్లలకు తేలికగా శుభ్రమైన పద్ధతిలో విద్యను అందించాలనే దానిలో భాగంగా బొమ్మలు, డ్రాయింగ్‌లు పాటలతో చిన్న పిల్లలకు తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.జి.యమ్.హరీష్, ఆర్.ఐ.పవన్ కుమార్, ప్రిన్సిపాల్ కుమారస్వామి, అకడమిక్ డీన్ స్వప్న, వైస్ ప్రిన్సిపాల్స్ ముంతాజ్ బేగం, భవాని, ఎఒ శివకష్ణ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, చిన్న పిల్లలు, విద్యార్థులు పాల్గొన్నారు.



జటాయు క్యారవ్యాన్‌ను ప్రారంభించిన ఎంఎల్‌ఎ వెలంపల్లి

అత్యాధునిక సౌకర్యాలతో జటాయు క్యారవాన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దేశ నలుమూలలు తిరిగేలా అన్ని వసతులతో కుటుంబ సౌకర్యాలు ఉండే విధంగా శ్రీ వెంకటేశ్వర మోటో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ క్యార వ్యాన్‌ని ప్రారంభించడం అభినందనీయమని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కుటుంబ సమేతంగా ఒకచోట నుంచి మరోచోటికి సులభంగా వెళ్లే విధంగా పూర్తి వసతులతో ఈ క్యారవాన్ ఉంటుందని తెలియజేశారు. కావున నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు. సినీ, సీరియల్, షార్ట్ ఫిలిం నిర్మాణాలకు సంబంధించి వినియోగించే జటాయు క్యారవాన్‌ను వన్‌టౌన్ గాంధీజీ హైస్కూల్ ప్రాంగణంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగురు యువకులు ఒక టీమ్‌గా కలిసి మంచి ఆలోచనతో ఎవరి మీద ఆధారపడకుండా తమ కాళ్ళ మీద తాము నిలబడాలని ఈ అద్భుత ఆలోచన చేశారని చెప్పారు. ఒక ఇంటిలో ఎన్ని మౌలిక సదుపాయాలు, ఎన్ని వసతులు ఉంటాయో అవన్నీ క్యారవాన్‌లో చూడొచ్చని చెప్పారు. క్యారవాన్ నిర్మాహకులు వంశీ, వక్కలగడ్డ నాగప్రసాద్ మాట్లాడుతూ ఈ క్యారవ్యాన్‌లో మూడు రకాల ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చాలా తక్కువ ఖర్చుతో కుటుంబం అంతా విహార యాత్రకు వెళ్ళవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చటర్జీ, మైలవరపు మాధురి లావణ్య, నిర్వాహకులు పరిమి సునీల్ కుమార్, కొరిపాకుల వినయ్ కుమార్, నటరాజ్ శేఖర్ సురేంద్రరావు, శ్రీనివాసరావు, సుబ్బారావు, మురళి, భాస్కర్ పాల్గొన్నారు.